క్లుప్తంగా

విద్యుత్ స్తంభం ఏర్పాటు



స్తంభం ఏర్పాటు చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఇంద్రవెల్లి: మండలంలోని అందునాయక్‌తండా రోడ్డు సమీపంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై ఈనెల 25న సాక్షిలో 'ఒరిగిన విద్యుత్ స్తంభం' శీర్షికన వచ్చిన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఒరిగిన స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్, సిబ్బంది ఉన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండల కేంద్రంతో పాటు సాత్నాల మండలంలోని కాన్ప మేడిగూడ(ఆర్)లో భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఆయా మండలాల తహసీల్దార్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాన్ప మేడిగూడ(ఆర్)లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు, మధ్యాహ్నం 2 గంటలకు జైనథ్ మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ రాజర్షిషా, ఆర్డీవో వినోద్ కుమార్, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మజ్జిగ పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మృతిచెందిన వారి జ్ఞాపకార్థం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉగ్రదాడిలో మరణించిన వారిని స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ సంఘం అధ్యక్షుడు దినేష్ మటోలియా, కందుల రవీందర్, ప్రమోద్ కుమార్ ఖత్రి, రాఘవేంద్రనాథ్ యాదవ్, రితీష్, సూర్యకాంత్, మౌనిష్ రెడ్డి, సంతోష్ అగర్వాల్, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బోథ్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సొసైటీ పరిధిలోని జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బోథ్‌లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల (బాలికల) ప్రిన్సిపాల్ సంగీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 239 గురుకుల జూనియర్ కళాశాలలు ఉండగా.. వీటిలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, వొకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశానికి అర్హులని తెలిపారు.

పహల్గాం మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

బేల: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు మానవతావాదులు సోమవారం నివాళులర్పించారు. స్థానిక శివాజీ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, అశ్రు నివాళులర్పించారు. ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేషక్, ఏజాజోద్దిన్, ఖయిర్, సలీం, సహిద్, అసద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన మెరుగు గంగాధర్‌కు రూ. 40 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టెడి రాజురెడ్డి, మెరుగు శ్రీనివాస్ రెడ్డి, ఇట్టెడి రాజశేఖర్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, చరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు



అధ్వానంగా కొలామా రోడ్డు

- 108 కూడా వెళ్లలేని పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

నార్నూర్: భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు పూర్తయినా.. ఏజెన్సీలోని గిరిజనుల బతుకులు మారలేదు. గిరిజన గ్రామాలకు సరైన రోడ్లు లేక అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామానికి కనీసం 108, 102 అంబులెన్స్ వాహనాలు రాలేని పరిస్థితి. గాదిగూడలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మారేగాం నుంచి మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన కొలా మా గ్రామం వరకు బీటీ రోడ్డు ఉంది. రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కోత కు గురయ్యాయి. ఈ రోడ్డు మార్గంలో మారేగాం, హీరాపూర్, గౌరీ, తోయగూడ, కొలామా ఎస్సీగూ డ, కొలామా గ్రామాలున్నాయి. మండల కేంద్రానికి వెళ్లాలంటే దాదాపు 20 కిలోమీటర్లకు మూడు గంటల సమయం పడుతుంది. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ప్రాణాలను అరచేతిలో పట్టుకొని ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి. గర్భిణుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



రోడ్డు సరిగా లేదు. ప్రయాణం చేయాలంటే భయంగా ఉంది. వాహనాలు రావడం లేదు. చాలా కష్టంగా ఉంది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. మా ప్రాణాలను అధికారులు కాపాడాలి.

– జుట్నాక రంబల్‌బాయి, కోలామా

పట్టించుకోవడం లేదు



మారేగాం నుంచి కొలామా వెళ్లాలంటే రోడ్డు పై గుంతలు ఏర్పడటంతో నరకయాతన పడుతున్నాం. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదు.

– ఆత్రం బొజ్జు పటేల్, కోలామా



అ'పూర్వ' సమ్మేళనం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జెడ్పీ ఉన్నత 2000–2001 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పినా.. గురువులను ఘనంగా సన్మానించారు.

సెలవులోనూ పాఠశాల నిర్వహణ

- సొంత ఖర్చుతో కూలర్ ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుడు



సెలవుల్లో చిన్నారులకు చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు ఆత్మరాం

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కేస్లాగూడ (చిత్రుగూడ) పాఠశాల ఉపాధ్యాయుడు ఆత్మరాం వేసవి సెలవుల్లో కూడా పాఠశాలను నిర్వహిస్తూ.. పిల్లలకు చదువు నేర్పించి గ్రామస్తులు మన్ననలు పొందుతున్నాడు. ఈనెల 24 నుంచి ప్రభుత్వం పాఠశాలలకు వే సవి సెలవులు ప్రకటించింది. కాని కేస్లాగూడ ప్రభుత్వ పాఠశాలు ఉపాధ్యాయుడు ఆత్మరాం మాత్రం తన సొంత ఖర్చుతో కూలర్ ఏర్పాటు చేసి ప్రతీ రోజు పిల్లలకు చదువు నేర్పిస్తున్నారు. పిల్లలు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ఉపాధ్యాయుడు ఆత్మరాం సేవలను గ్రామస్తులతో పాటు మండల వాసులు అభినందిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



సీజ్ చేసిన వాహనాలతో సీఐ, పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జైనథ్ సీఐ సాయినాథ్ హెచ్చరించారు. సోమవారం జైనథ్ మండల కేంద్రంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలు, స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాలు నడిపిస్తున్న మైనర్లను గుర్తించినట్లు తెలిపారు. నంబర్‌ప్లేట్ లేని 10 వాహనాలు, మైనర్ పిల్లలు నడుపుతున్న 4 బైక్‌లను సీజ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా బేల పోలీస్‌స్టేషన్ పరిధిలో పది నంబర్ ప్లేట్ లేని, రెండు మైనర్లు నడిపే వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో జైనథ్, బేల ఎస్సైలు పురుషోత్తం, దివ్యభారతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'మై ఆటో ఈస్ సేఫ్'పై అవగాహన

బేల: మండల కేంద్రంలోని వారసంతలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో 'మై ఆటో ఈస్ సేఫ్'పై మండల ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం, భద్రత కోసమే 'మై ఆటో ఈస్ సేఫ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 50 ఆటోలకు క్యూఆర్ కోడ్ అనుసంధానం చేస్తామన్నారు. ఆటోలో ప్రయాణం చేసేటప్పుడు డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించినా, దురుసుగా మాట్లాడినా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడంతో ఎమర్జెన్సీ కాల్ చేయడమే కాకుండా డ్రైవర్ పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎస్సై దివ్య భారతి, ఏఎస్సై కనకే జీవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ

కైలాస్‌నగర్: సివిల్ సర్వీస్ డేను పురస్కరించుకుని భారత ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా శాఖ బాధ్యులు క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. డైరీని అందజేసి అభినందనలు తెలిపారు. నూర్ సింగ్, నవీన్ యాదవ్, విట్టల్ గౌడ్, కనక అభిమాన్, శ్యామల రాజు, జాదవ్ ప్రకాష్, దాసరి బాబన్న పాల్గొన్నారు. ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం ఆధ్వర్యంలోనూ కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

ఎస్పీని కలిసిన కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కంది శ్రీనివాస రెడ్డి, అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని జీఎస్ ఆయిల్ మిల్లులో ఈనెల 24న రాత్రి ఇనుప సామగ్రిని ముగ్గురు వ్యక్తులు దొంగలించారు. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన బండారి ఈశ్వర్ చోరీ చేసిన వాటిని పిట్టలవాడలోని స్క్రాప్ దుకాణంలో విక్రయించేందుకు వెళ్తుండగా టూటౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆయనతో పాటు స్క్రాప్‌ను కొనుగోలు చేస్తున్న యజమాని అహ్మదుల్లాను రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. చోరీకి పాల్పడిన మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నాడు.

చెరువు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: మండలంలోని కరత్వాడ చెరువు సమీపంలో చేపడుతున్న చేపల చెరువును బోథ్ ఎంపీడీవో రమేశ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు తీశారు. ఉపాధిహామీ కూలీలు ఉదయ 6 గంటలకు పని ప్రదేశాలకు వెళ్లి, 11 గంటలలోపు పనులు ముగించుకు రావాలన్నారు. అనంతరం పట్నాపూర్, కరత్వాడ, నక్కలవాడ, లక్ష్మీపూర్, కొత్తపల్లె, రేండ్లపల్లె గ్రామాల్లో ఇందిరిమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన కేసీఆర్'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: తెలంగాణ యువకుల ప్రాణ త్యాగాల పునాదులపై నిర్మితమైన రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్లలో పథకాల పేరుతో వేల కోట్లు దోచుకొని అప్పులు పాలు చేశారని నిర్మల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. కేసీఆర్ అవినీతి సొమ్ములో కాంగ్రెస్ నేతలకు వాటాలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిన కాంగ్రెస్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ కనుసన్నల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నడుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, మారుతి దేవ్‌పూజే, రాథోడ్ భీంరావ్, ముండే రాజేశ్వర్, మస్కే రాజువర్ధన్, గణపతి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ: మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహం అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. వివాహం జరుగుతుందని తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, అధికారులు జిల్లా బాలల సంరక్షణ సమితి చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్ సిబ్బంది సహకారంతో బాల్య వివాహన్ని అడ్డుకున్నారు. అదే విధంగా బాల్య వివాహంతో జరిగే అనర్థాల గురించి అమ్మాయి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, డీసీపీయూ కౌన్సిలర్ పద్మ, సోషల్ వర్కర్ రవికాంత్, కృష్ణవేణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ భవన్ కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాకు హిందీ భవన్ కేటాయించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను హిందీ భాష సేవా సమితి సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో గత 25 సంవత్సరాలుగా హిందీ భాషా సాహితీ కార్యక్రమాలు, హిందీ దినోత్సవాలను జిల్లా కేంద్రంలో హిందీ భాష సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నమన్నారు. నిర్వహణకు భవనాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో హిందీ భాషా సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుకుమార్ పెట్కులే, మహేశ్, చంద్రశేఖర్, జావేద్ అలీ, భాస్కర్ ప్రధాన్, రాగి సాంబన్న పాల్గొన్నారు.

మత్తడివాగు పూడిక తీయాలని వినతి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న మాజీ సర్పంచ్, గ్రామస్తులు

తాంసి: మండల కేంద్రంలోని మత్తడివాగు పూడిక తీయాలని కలెక్టర్ రాజార్షిషాను కోరారు. సోమవారం మండల కేంద్రానికి భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్‌కు గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మత్తడివాగు పూడికతీత పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందన్నారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామన్న యాదవ్, దేవారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సామూహిక పారాయణం



పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజ రాజేశ్వర శివాలయంలో సోమవారం సామూహిక పారాయణం నిర్వహించారు. భక్తులు ప్రతీ సోమవారం సామూహిక పారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. పారాయణం 9వ సోమవారానికి చేరుకుంది. భక్తులు ఉదయం 7.30ల నుంచి పారాయణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన చిలువేరి రాణి నాగభూషణ్ దంపతులు అన్నదానం నిర్వహించారు.

'సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 16 నెలలు గడిచినా ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. వరంగల్ సభకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్ల పాటు సుపరిపాలన అందించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలు గర్వంతో మాట్లాడుతున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 3వేల మంది లక్ష్యం పెట్టుకోగా, 7 వేలకు పైగా తరలివచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అజయ్, అష్రఫ్, మెట్టు ప్రహ్లాద్, గోవర్ధన్, రాజన్న, ధమ్మపాల్, కొండ గణేష్, దేవన్న, శివ, రాజు, అన్సార్, ముఖీమ్, సతీష్, వేణు యాదవ్, రమేశ్, సాజిదొద్దీన్ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాథోడ్ జీవన్

నేరడిగొండ: పశు పోషకులు, రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. సోమవారం మండలంలోని బోరిగాం గ్రామంలో పశువులకు సామూహిక ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలని అన్నారు. పశువులకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నారు. సోమవారం మండలంలోని జామిడిలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది మాట్లాడుతూ.. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకొని వర్షకాలంలో గాలికుంటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది చంద్రశేఖర్‌రావు, దేవురావు, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర'



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. మహాత్మాగాంధీ , అంబేడ్కర్ చిత్రపటాలతో జై బాపు, జై భీం, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. దేశంలోని రాజ్యాంగ సంస్థలను బలహీనపరిచేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాజ్యంగ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామస్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ విజయవంతం



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ సభ విజయవంతం అయిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ బహిరంగ సభకు భారీ ఎత్తున తరలి వచ్చిన బోథ్ నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. 2001 నాటి తెలంగాణ ఉద్యమ జోష్ మళ్లీ కనిపించిందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలు ఎంత వ్యతిరేకంగా ఉన్నారో ఈ సభ ద్వారా తెలిసిపోయిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కన్వీనర్ వెంకటేశ్, కేదరేశ్వర్‌రెడ్డి, కిరణ్ కుమార్, అబ్దూలా, ప్రకాష్, గోవర్ధన్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, సునీతరెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.